ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

శనివారం 20 జనవరి 2024





'ఖని'లో సైబర్ నేరస్థుల పంజా
- ఆధార్ అనుసంధానం పేరిట బ్యాంకు ఖాతాలు ఖాళీ
7లో..

'ఆదర్శ' విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి: కలెక్టర్
8లో..


# పెండింగ్ బిల్లుల 'పంచాయతీ'



- జిల్లా వ్యాప్తంగా రూ.80 కోట్లకు పైనే..
- జనరల్ ఫండ్, ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ బిల్లులే ఎక్కువ
- ట్రెజరీల్లో కానరాని జనరల్ ఫండ్
- ఏడాదిన్నరగా రాని ఎస్ఎఫ్‌సీ నిధులు
- పదకొండు రోజుల్లో ముగియనున్న పదవీకాలం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామ పంచాయతీల ద్వారా చేపట్టిన వివిధ రకాల పనుల బిల్లులు రాక సర్పంచులు సతమతం అవుతున్నారు. బిల్లుల కోసం ట్రెజరీల చుట్టూ తిరుగుతున్నా కూడా ఒక్క బిల్లు కూడా పాస్ కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు మాసాల క్రితం వేసిన చెక్కులు కూడా ట్రెజరీల్లో మంజూరు కావడం లేదు. చివరకు గ్రామపంచాయతీకి వివిధ పన్నుల రూపేణా వచ్చే డబ్బులను జనరల్ ఫండ్ కింద జమచేసినా కూడా ఆ నిధులపై కూడా గత మూడు, నాలుగు మాసాల నుంచి ఫ్రీజింగ్ కొనసాగిస్తుండడంతో సర్పంచులు బిల్లులు పాస్ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందనే భావిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీలకు అన్ని రకాల బిల్లులు కలిపి 80 కోట్ల రూపాయలకు పైగా పెండింగులో ఉంటాయని సర్పంచులు చెబుతున్నారు.


జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల నిర్వహణ, పారిశుధ్య పనులకు, విద్యుత్ దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇతరత్రా అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం జనాభాను అనుసరించి 15వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చే నిధులతో పాటు రాష్ట్ర ఆర్థిక సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు, పంచాయతీల్లో ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, నల్లా కనెక్షన్లు, ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే అనుమతులు, అంగళ్ల నిర్వహణ ద్వారా వచ్చే డబ్బులు, సీనరేజీ పన్నుల ద్వారా వచ్చే జనరల్ ఫండ్, ఉపాధిహామీ పథకం ద్వారా వచ్చే నిధులను వెచ్చిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం 16 మాసాల నుంచి రాష్ట్ర ఆర్థిక సంస్థ నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని, డిసెంబరులో రావాల్సిన 15వ ఆర్థిక సంఘం క్వార్టర్ నిధులు రాలేదని సర్పంచులు చెబుతున్నారు. జనరల్ ఫండ్, ఉపాధిహామీ నిధులు, ఏడాదిన్నర క్రితం అప్పటి సీఎం కేసీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభానికి వచ్చిన సందర్భంగా ప్రతి గ్రామ పంచాయతీకి అభివృద్ధి పనుల కోసం 10 లక్షలు ఎస్‌డీఎఫ్ కింద మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టిన పనుల కు సంబంధించి బిల్లులు రావడం లేదని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. జులై, ఆగస్టు మాసాల్లో వేసిన చెక్కుల డబ్బులు ఇటీవల వచ్చాయని కొందరు సర్పంచులు పేర్కొన్నారు.

### కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు..

గ్రామాల్లో ఉపాధిహామీ కూలీ పనుల ఆధారంగా జనరేట్ అయ్యే 40శాతం నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల పనులు, పంచాయతీ కార్యాలయాల భవన నిర్మాణ పనుల బిల్లులు సక్రమంగా రాకపోవడంతో సర్పంచులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ట్రెజరీల్లో జమచేస్తున్న జనరల్ ఫండ్‌తో చేపట్టిన పనుల బిల్లులు కూడా పాస్ కావడం లేదని చెబుతున్నారు. ఖాతాల్లో డబ్బులు ఉన్నట్లు చూపుతున్నప్పటికీ చెక్కులు పాస్ కావడం లేదని అంటున్నారు.

గత ప్రభుత్వం ఇతరత్రా అవసరాల కోసం పంచాయతీ జనరల్ ఫండ్‌ను కూడా వాడుకుని ఉంటుందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నెలాఖరుతో ప్రస్తుతం ఉన్న పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగియనున్నది. పార్లమెంట్ ఎన్నికలు అయ్యే వరకు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. పాలకవర్గాల స్థానంలో పర్సనల్ ఇన్‌చార్జీలను నియమిస్తుందా, ప్రత్యేక అధికారుల పాలన విధిస్తుందా అనే విషయమై ఇంకా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ప్రత్యేక అధికారుల పాలన తీసుకవస్తే బిల్లుల మంజూరులో మరింత ఆలస్యం కానున్నదని సర్పంచులు అంటున్నారు. తమ పదవీకాలం ముగిసేలోపు జనరల్ ఫండ్‌తో చేపట్టిన పనుల బిల్లులు పాస్ అయ్యే విధంగా ట్రెజరీల్లో ఫ్రీజింగ్ లేకుండా చూడాలని, గత ప్రభుత్వం ఈ నిధులను వాడుకుని ఉంటే రీయింబర్స్ చేయాలని, ఎస్‌డీఎఫ్ బిల్లుల చెల్లింపు కోసం నిధులను విడుదల చేయాలని, పర్సనల్ ఇన్‌చార్జీల పాలన తీసుకరావాలని సర్పంచులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




## 24 వరకు జాతీయ బాలికల వారోత్సవాలు

**- జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్**

పెద్దపల్లి కల్చరల్, జనవరి 19 : జిల్లాలో ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు జాతీయ బాలికల వారోత్సవాలను నిర్వహిస్తున్నామని జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 24 వరకు జాతీయ బాలికల వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ సమన్వయంతో జిల్లాలోని బాలికల ఉన్నత పాఠశాలలు, గురుకుల బాలికల విద్యాలయాలు, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లోని విద్యార్థులకు వ్యాస రచన, క్రీడా పోటీలు, డ్రాయింగ్, స్పీచ్, పేరెంట్స్ మీటింగ్, బేటీ బచావో, బేటీ పడావో జాతీయ బాలికల దినోత్సవంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 24న జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

## గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 19 : స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అందించే ఉచిత గ్రూప్ శిక్షణ కోసం జనవరి 20లోపు దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు www.bcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్లో శిక్షణ కోసం డిగ్రీ అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం 5 లక్షలకు మించరాదని, దరఖాస్తుతో పాటు ఎస్.ఎస్.ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఆధార్ కార్డు, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని, వివరాలకు ఫోన్ నంబరు 0878 2268686లో సంప్రదించాలని కోరారు.

## బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా రాజనర్సయ్య

పెద్దపల్లిటౌన్, జనవరి 19: బీఎస్పీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఇరికిల్ల రాజ నర్సయ్య నియామకమయ్యారు. తన నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి, నియోజకవర్గ ఇన్‌చార్జులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో బీఎస్పీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసే దిశగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గొట్టే రాజు, మొలుమూరి చంద్రశేఖర్, తోట వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి

**- ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు**



ఆరెపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు



లోకపేటలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

కాల్వశ్రీరాంపూర్, జనవరి 19: పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, తాను కలిసి పనిచేస్తామని ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని పెగడపల్లి గ్రామంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.6.82లక్షలతో నిర్మించిన డైనింగ్ గది, అనంతరం ఆరెపల్లి గ్రామంలో రూ.20లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరెపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో భానుప్రసాద్‌రావు మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయం ఉంటుందని, ఎన్నికల తరువాత గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. కేసీఆర్ అధికారంలో ఉండగా చిన్న గ్రామాలు ఏర్పాటు చేసి సంక్షేమ అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించారన్నారు. ప్రభుత్వాలు మారినా వారి ప్రణాళికలు మారుతుంటాయి తప్ప ఏ ప్రభుత్వం వచ్చినా గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు ఎలాంటి వ్యాపారాలు లేవని, ఎప్పుడు ప్రజల్లో ఉండే విజయరమణారావుతో కలిసి తాను అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఈ మండలంలో ఎస్ఆర్ఎస్‌పీ టేలెండ్ ప్రాంతాలకు సాగునీరు అందించడంతో పాటు సాగునీరు అందించేందుకు తన సహాయసహకారాలు ఎళ్లవేళలా ఉంటాయన్నారు. తన తల్లి కాల్వశ్రీరాంపూర్‌లో గతంలో హాస్టల్‌లో ఉండి చదువుకుందని, అందుకే ఈ మండలం తనకెంతో ఇష్టమని, మండల అభివృద్ధికి సహాయసహకారాలు అందిస్తానన్నారు. ఆరెపల్లి గ్రామానికి సర్పంచ్ దేవేందర్‌రావు ఎన్నో నిధులు తీసుకురావడం జరిగిందని, తన వంతు కూడా నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. మరో రూ.5లక్షలు ఎమ్మెల్సీ నిధుల నుంచి ఆరెపల్లికి ఇవ్వనున్నట్టు తెలిపారు. కాగా, గ్రామానికి అంగన్‌వాడీ సెంటర్, రేషన్ డీలర్‌షిప్, ఆరేపల్లి, మల్లయ్యపల్లెకు రూ.20లక్షలతో సీసీ రోడ్లు, కమ్యూనిటీహాల్, రూ.5లక్షలతో జీపీ ప్రహరి, పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావును సర్పంచ్ దేవేందర్‌రావు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ రోడ్లకు రూ.10లక్షలు, మహిళా భవనాన్ని రెండు నెలలోపు మంజూరుచేస్తానని, మిగతా పనులు దశల వారీగా మంజూరు చేస్తానని, వాటర్‌ప్లాంట్ స్వయంగా నిర్మించిఇస్తానని హామీ ఇచ్చారు. గ్రామాలకు సాగునీరు అందించడంతో పాటు వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో కటింగ్ లేకుండా చూస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణరావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావులకు సర్పంచ్‌తో పాటు గ్రామస్థులు సన్మానించారు. ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లుఎ పొన్నం దేవేందర్‌గౌడ్, ఆరెల్లి సుజాతరమేష్, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

### అభివృద్ధి విషయంలో రాజీపడేదిలేదు..

ఎలిగేడు, జనవరి 19 : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్ల అభివృద్ధి చేస్తామని శాసనమండలి సభ్యుడు తానిపర్తి భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు వెల్లడించారు. మండలంలోని ముప్పిరితోట, లోకపేట గ్రామాల్లో శుక్రవారం రూ.17లక్షలతో నిర్మించిన మహిళ భవనం, 25లక్షలు వెచ్చించి నిర్మించిన జనరల్ కమ్యూనిటీ హాల్, రూ.6లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులు, అనంతరం లోకపేట గ్రామంలో రూ.5లక్షలతో బోయవాల్మీకి కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్టీలకతీతంగా నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యేతో విజయరమణారావుతో నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలను నందనవనంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. తమ ఇద్దరి సొంత మండలం ఎలిగేడు మండలం అయినందున మండలంలోని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో నియోజకవర్గంలో కలిసి పని చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తానిపర్తి స్రవంతి, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, సర్పంచ్‌లు పెద్దోళ్ల ఐలయ్య, సర్పంచ్ ప్రభావతి, అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, బూర్ల సింధూజ, ఎంపీటీసీ నారగోని ఎల్లవ్వ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్ రావు, పర్శరాంగౌడ్, కొండా తిరుపతిగౌడ్, పెద్దపల్లి దేవరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టుకు సాగు నీరందిస్తాం..

**- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



నంది రిజర్వాయర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, జనవరి 19: చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా శాశ్వత పరిష్కారం చూపనున్నట్టు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ధర్మారం మండలం నందిమేడారంలోగల కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని నంది రిజర్వాయర్‌ను ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గలోని అన్ని మండలాల్లో చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ, కాళేశ్వరం నీటిని అందించుటకు శాశ్వత పరిష్కారం చూపాలని ఈనెల 6న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారని ఆయన వివరించారు. ప్రధానంగా నంది రిజర్వాయర్ ద్వారా ధర్మారం, వెల్గటూర్ మండలాల్లోని రైతులకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మల్లాపూర్ డి83/బి, కాళేశ్వరం సాగునీటిని విడుదల చేసేలా ప్రత్యామ్నాయంగా ప్రణాళికలు తయారు చేయాలని ఆయన చెప్పారు. ఎల్లంపల్లి, కాళేశ్వరం నీటి నీటి సామర్థ్యం గురించి ఇరిగేషన్ అధికారులు ఆయనకు వివరించారు. ఆయన వెంట జగిత్యాల జిల్లా నీటి పారుదల శాఖ సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ నూనే శ్రీధర్, డీఈఈలు నర్సింగారావు, విష్ణు, ఏఈఈలు కార్తీక్, ఫణిందర్, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### సాగునీటిని విడుదల చేయాలి..

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని నంది రిజర్వాయర్ ద్వారా సాగు నీటిని విడుదల చేయాలని శుక్రవారం వెల్గటూర్ మండలంలోని పది గ్రామాల రైతులు శుక్రవారం నందిమేడారంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు విన్నవించారు. సాగునీటిని విడుదల చేస్తారనే ఉద్దేశ్యంతో నార్లు పోసుకున్నామని వారు వివరించారు. సాగు చేస్తున్న పంటలు ఎండిపోకుండా ఇక్కడి నుంచి నీటి విడుదల చేస్తే పది గ్రామాల రైతులకు ఉపయోగపడుతుందని వారు విన్నవించారు. స్పందించిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నంది మేడారం నంది రిజర్వాయర్‌లో తూము వద్ద తాత్కాలికంగా నీటిని విడుదల చేశారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమయ్యేలా చూస్తానని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు.

### హైస్కూల్‌ను సందర్శించిన ప్రభుత్వ విప్

నందిమేడారంలోని ప్రభుత్వ హై స్కూల్‌ను శుక్రవారం మధ్యాహ్నం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సందర్శించారు. విద్యార్థుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్య, పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని హైస్కూల్ హెచ్ఎం వసంత వివరించారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు.

# పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను పరిష్కరించాలి

**- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లిటౌన్, జనవరి 19: పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను సకాలంలో పూర్తి చేయాలని, 2024 జనవరి 1 నాటికి 18ఏళ్ల నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఓటర్ నమోదు కార్యక్రమం, పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. ఓటరు నమోదు కార్యక్రమం, ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపుల ఏర్పాటు, పెండింగ్ ఫారంల పరిష్కారం, పార్లమెంటు ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ పలు సూచనలు చేశారు. వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అన్నారు. ఓటర్ల నమోదుకు 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. జనవరి 6, 2024 విడుదల చేసిన ముసాయదా ఓటరు జాబితాపై ప్రజల నుంచి జనవరి 22 వరకు అభ్యంతరాలను స్వీకరించాలని, ఫిబ్రవరి 2లోగా అభ్యంతరాలను, ఓటర్ క్లెయిమ్స్‌ను పూర్తిస్థాయిలో పరిష్కరించి, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 20,21 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి, ప్రజలు, ఓటర్ల నుంచి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని, 2024 జనవరి 1నాటికి 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కు లేని వారందరూ ఓటర్‌గా నమోదుకు ఈ అవకాశం వినియోగించుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. రాబోయే పెద్దపెల్లి పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి అధికారులు సన్నద్ధంగా ఉండాలని, ఎన్నికల నిర్వహణకు అసెంబ్లీ సెగ్మెంట్‌లో వారీగా పోలింగ్ కేంద్రాల జాబితా రూపొందించాలన్నారు. పార్లమెంటు ఎన్నికలకు కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ జారీ చేయడం జరుగుతుందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల జారీ, వాటి నమోదుకు రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, వాటి లెక్కింపు కట్టుదిట్టంగా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు సీహెచ్ మధుమోహన్, వి.హనుమా నాయక్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్, షఫీ, ఈశ్వర్, సీనియర్ అసిస్టెంట్ వజహత్ అలీ, ఐటీ సిబ్బంది కిరణ్, వరప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ సీఐని సస్పెండ్ చేయాలి

**- బాధితులకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : ఏఐవైఎఫ్**



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

కళ్యాణ్‌నగర్, జనవరి 19: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కల్తీ కల్లును అరికట్టలేని ఎక్సైజ్ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని, సొసైటీ సభ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గోదావరిఖని చౌరస్తాలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్క పురి సూర్య ఆధ్వర్యంలో ప్ల కార్డులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీర, కల్లు అమ్మడానికి సొసైటీ అనుమతులను పొంది ఆర్థిక దురాశతో నిషేధిత డైజోఫామ్, ఆల్ప్రాజోమ్, క్లోరోఫామ్ వంటి మత్తు పదార్థాలు కలిపి అమాయకుల ప్రాణాలు బలిగొంటున్నారని ఆరోపించారు. నెల రోజుల్లో కల్తీ కల్లుతో ముగ్గురు ప్రాణాలు బలి తీసుకున్నారని, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రెండు సొసైటీల ఆధ్వర్యంలో 15 కల్లుడిపోలు నడుస్తున్నాయని, ఇందులో నిత్యం కల్తీ కల్లు అమ్ముతున్నా ఎక్సైజ్ అధికారులు నియంత్రణ చేయకపోవడం వల్లనే మృతి చెందుతున్నారని, ఇక్కడ ఆరు సంవత్సరాలుగా ఎక్సైజ్ సీఐ పాతుకుపోయారని, సీఐపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అవినీతికి అద్దం పడుతుందని, ఎక్సైజ్ సీఐని వెంటనే సస్పెండ్ చేసి కల్తీకల్లు అమ్మకుండా నియంత్రించాలని డిమాండ్ చేశారు.

ఈ నిరసనలో నాయకులు సాదుల శివ, నవీన్, రేణకుంట్ల ప్రీతం, సుధీర్, దబ్బెట గోపి కృష్ణ, రాజు, సురేష్ వినయ్, కరీంగౌస్ తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ కల్లు ఘటనపై పోలీసులు సీరియస్

**- సొసైటీ డైరెక్టర్లు, నిర్వాహకులపై కేసు - డైరెక్టర్ శ్రీనివాస్ అరెస్టు**

కోల్‌సిటీ, జనవరి 19: గోదావరిఖని డిపో-1 కల్లు డిపోలో కల్లు తాగి ఇద్దరు మృతిచెందిన ఘటనపై పోలీసులు సీరియస్‌గా స్పందించారు. మృతుడు రమేష్ కుమారుడు అవినాష్ ఫిర్యాదు మేరకు సొసైటీ డైరెక్టర్లు, నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న వంగ శ్రీనివాస్‌ను గురువారం రాత్రి రిమాండ్ చేశారు. సొసైటీకి సంబంధించి పూర్తివివరాలు ఇవ్వాలంటూ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు పోలీసులు లేఖ రాశారు. ఎక్సైజ్‌శాఖ సుమోటోగా కేసు నమోదు చేసి శాంపిల్స్‌ను వరంగల్ ల్యాబ్‌కు పంపింది. పోలీసులు కూడా శాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. ఎక్సైజ్ శాఖ ఇచ్చే వివరాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకునేందుకు పోలీస్‌శాఖ సిద్ధమవుతుంది.

కాగా ఈ డిపోకు పూర్తిస్థాయి కమిటీ లేనట్టు తెలుస్తున్నది. గతంలో తాత్కాలికంగా డైరెక్టర్లను నియమించుకుని సొసైటీని నిర్వహిస్తున్నట్టు సమాచారం. 15మంది డైరెక్టర్లలో ఐదుగురు సొసైటీ కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. ఈ కేసులో ల్యాబ్ నివేదికలే కీలకంగా మారనున్నాయి.

### బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సంధ్యారాణి

గోదావరిఖని, జనవరి 19: కల్తీ కల్లు తాగి మృతి చెందిన రమేష్, నవీన్ కుటుంబాలకు న్యాయం చేయాలని, ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి డిమాండ్ చేశారు. శుక్రవారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎక్సైజ్‌శాఖ నిర్లక్ష్యంతో, నిషేధిత మత్తు పదార్థాలను వాడడం వల్లనే రెండు ప్రాణాలు బలయ్యాయని, కొంత మంది అక్రమార్కులు అడ్డదారిన డబ్బు సంపాదించేందుకు కల్తీకల్లు తయారుచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. దోషులపై చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించిన ఎక్సైజ్ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సైదాపూర్, జనవరి 19: సైదాపూర్ మండల వ్యాప్తంగా ఎరువుల దుకాణాలను విస్తృ తంగా తనిఖీ చేస్తున్నట్లు వ్యవసా యాధికారి వైదేహి తలిపారు. శుక్రవారం సైదాపూర్ మండల కేంద్రంతో పాటు పెర్కపల్లి, ఆకునూర్, ఎల్లంపల్లి గ్రామాలలో వ్యవసాయాధికారి వైదే హి ఎరువుల దుకాణాలు తనిఖీ చేయడంతో పాటు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతీ రోజు కొన్ని షాపులను ఎంచుకొని వాటిలో రికార్డులను పరిశీలస్తున్నామన్నారు. డీలర్లు ఎపోస్ మిషన్‌కు స్టాక్ రిజిష్టర్ గ్రౌండ్ బ్యాలన్స్ తో సరి పోతుందా లేదా అనిపరిశీలిస్తున్నామని చెప్పారు. ఎరువుల విక్రయాలు తప్పని సరిగా ఎపోస్ మిషన్ ద్వారానే చేయాలనిన్నారు. ఈ యాసంగి సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా స్టాక్ ఎప్పిటికప్పుడు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంచాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తనిఖీలలో రికార్డుల సక్రమంగా లేనట్లు తేలితే షాపుల లైసన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. షాపుల పరిశీలనతో పాటు ప్రతీ రోజు పంటలను పరిశీలస్తున్నామని వివరించారు. చీడ పీడల నివారణకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరిస్తున్నామని తెలిపారు.

## పాముకాటుతో బాలుడి మృతి


సుహాన్(ఫైల్)

మానకొండూర్, జనవరి 19: మానకొండూర్ గ్రామానికి చెందిన సుహన్ అనే బాలుడు శుక్రవారం పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అనూష నవీన్ దంపతుల కుమారుడు సుహాన్(3) ఏళ్ల బాలుడు శుక్రవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటుండగా పాము కాటు వేసింది.. బాలుడు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సైదాపూర్, జనవరి 19: సైదాపూర్ మండల కేంద్రంలో జీపు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెన్కేపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్, రజినీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు సైదాపూర్ పాత బస్టాండ్ మీదుగా దుద్దెనపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన జీపు ఆ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. కింద పడిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## మహిళా గురుకులంలో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్

జగిత్యాలరూరల్, జనవవరి 19: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులో గల సాంఘిక సంక్షేమ శాఖ మహిళా గురుకుల కళాశాలలో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 20న మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించనునన్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ గోలి శ్రీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 టీఎస్ ఎంసెట్ (బైపీసీ)లో అర్హత సాధించినవారు అర్హులని ఆసక్తికలవారు అన్ని ధ్రువపత్రాలు ఒరిజనల్ జిరాక్స్ ప్రతులతో హైదరాబాద్‌లోని సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల ప్రధాన కార్యాలయంలో హాజరుకావాలన్నారు. వివరాలకు కళాశాలలో 8142747880లో సంప్రదించాలని కోరారు

# రాజన్న క్షేత్రంలో భక్తుల సందడి

● అనుబంధ ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు

వేములవాడ, జనవరి 19: వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని శ్రీస్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. బాలాత్రిపురా సుందరీదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమపూజ, కళాభవన్లో శ్రీస్వామివారి నిత్యకళ్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో లఘు దర్శనం అమలు చేశారు. దీంతో భక్తులు నందీశ్వరుడి విగ్రహం వద్ద నుండి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

## ధర్మపురిలో రెండో రోజు వేద పారాయణం

ధర్మపురి, జనవరి 19: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు రెండవ రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రెండో రోజు 21 మంది వేదపండితులు రుగ్వేద హవనం, సామవేద పారాయణం, శ్రీ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచనల మేరకు ఆలయ వేదపండితులు, అర్చకులు, రినోవేషన్ కమిటీ సభ్యులు, స్థానిక వేదబ్రాహ్మణులు ఈ కార్యక్రమానికి సహకారం అందించారు. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ మండపంలో కూడ వేదపండితులు పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ముత్యాలశర్మ, ఆలయ ఉపప్రదాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



వేదపారాయణం నిర్వహిస్తున్న వేదపండితులు

## పాస్‌పోర్ట్ ఏజెంట్ల ఇళ్లలో సీబీఐ సోదాలు

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు



పాస్ పోర్ట్ ఏజెంట్ ఇంటి వద్ద సీబీఐ అధికారులు

కోరుట్ల, జనవరి 19: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రైవేట్ పాస్‌పోర్టు ఏజెంట్ల ఇళ్లపై సీబీఐ అధికారులు శుక్రవారం సోదాలు చేశారు. కోరుట్ల పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న అశోక్, ఐబీ రోడ్డులో నివాసం ఉంటున్న చాంద్ పాషా (ప్రభుత్వ ఉపాధ్యాయుడు), రతాల పంపు ప్రాంతంలో ఉంటున్న కమర్ పాస్‌పోర్టు ఏజెంట్ల ఇళ్లలో అధికారులు సోదాలు జరిపారు. నాలుగు బృందాలుగా విడిపోయిన సీబీఐ అధికారులు ఏకకాలంలో వారి వారి ఇళ్లలో సోదా చేసి ఇంట్లో ఉన్న నకిలీ నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, వివిధ అధికారుల హోదాతో ఉన్న స్టాంప్‌లతో పాటు ల్యాప్‌టాపులను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిసింది. అశోక్ రావు, కమర్‌ను అదుపులోకి తీసుకోగా చాంద్ పాషా పరారైనట్లు తెలుస్తోంది. అశోక్ రావుతో పాటు కమర్‌ను విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా చాంద్ పాషా పరారీలో ఉన్నడని ప్రచారంతో పాటు హైదరాబాదులో వారి బంధువుల శుభకార్యానికి వెళ్లినట్లు ప్రచారం జరుగుతుంది. కొందరు గల్ఫ్ ఏజెంట్లు, ట్రావెల్స్ యజమానుల గుండెలలో రైలు పరుగులు తీయడంతో పాటు వారి కార్యాలయాలను మూసివేసుకున్నారు. సీబీఐ అధికారులు కోరుట్ల నుంచి వెళ్లిపోయ్యారన్న సమాచారంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

## ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్




మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మెట్‌పల్లి, జనవరి, 19: ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన ఎస్సై చిరంజీవితో కలిసి మాట్లాడారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన షేక్ హైదర్, నిజామాబాద్ జిల్లా మోర్తడ్‌కు చెందిన ఎర్ర వెంకటి, కొర్వ సంతోష్‌కు ఆరు నెలల క్రితం జైల్లో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలైన తరువాత సులభంగా డబ్బులు సంపాదించాలని ఆలోచనతో ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. రెండు నెలల క్రితం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని సాయిబాబ ఆలయంలోని హుండీ, 15 రోజుల క్రితం కోరుట్ల పట్టణంలోని ఎల్లమ్మ గుడిలోని హుండీ, ఇబ్రహీంపట్నంలోని గోదురులోని పోచమ్మ, హనుమాన్ ఆలయాల్లోని హుండీ పగలగొట్టి బంగారం, వెండి అభరణాలు చోరీ చేశారు. కోరుట్ల మండలంలోని ధర్మారంలోని రామాలయంలోని హుండీ పగలగొట్టి నగదు దోచుకున్నారు. మూడు రోజుల క్రితం మండలంలోని జగ్గసాగర్, రామలచ్చక్క, ఆత్మనగర్ గ్రామాల్లోని ఆలయాల్లోని బంగారం, వెండి, హుండీలను ఎత్తుకెళ్ళారు. వారిని మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులో వారిని పట్టుకొని ద్విచక్ర వాహనం, 14 తులాల వెండి, రూ. 9 వేలు, తాళాలు పగల గొట్టే కొంకిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్‌తో పాటు కానిస్టేబుల్ కిరణ్, సంతోష్‌ను డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించి రివార్డులను అందజేశారు.

## ఆలయాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని ఆందోళన

- అధికారుల చర్చలతో సద్దుమణిగిన గొడవ



ఆందోళన చేస్తున్న తిమ్మాపూర్ గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, జనవరి 19: ఆలయాలకు రహదారితో పాటు ఆలయానికి సంబంధించిన భూమిని వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తు శుక్ర వారం తిమ్మాపూర్ గ్రామస్థులు పెద్దమ్మ ఆలయం వద్ద రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామ శివారులోని గ్రామ దేవతలైన పోచమ్మతో పాటు వివిధ ఆలయాలకు వెళ్లేందుకు రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని అక్కడకు వెళ్లేందుకు రహదారి ఇస్తానని చెప్పి ఇప్పుడు ఇవ్వకుండా వీడీసీ సభ్యులపైన పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ దాదాపుగా మూడు గంటల పాటు మహిళలు, గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించారు. ఎస్ఐ ఉమాసాగర్ అక్కడకు చేరుకుని వారిని శాంతింపజేసే ప్రయత్నం చేసినా వినలేదు. దీంతో సంఘ బహిష్కరణకు గురైన బాధిత కుటుంబ సభ్యులను పిలిపించారు. అక్కడకు చేరుకుని ఇరువురు చర్చలు జరిపారు. ఆనంతరం ఇరువు రు శాంతించి ఆలయాలకు వెళ్లేందుకు నాలుగు ఫీట్ల రోడ్డును ఇవ్వడంతో పాటు వీడీసీ సభ్యులపై పెట్టిన కేసులు వెనక్కి తీసుకుంటున్నట్లు తెలపడంతో గ్రామస్థులు శాంతించారు.

## కరీంనగర్ కార్పొరేటర్ కుల ధ్రువీకరణ పత్రం రద్దు

కరీంనగర్ టౌన్, జనవరి 19: నగరపాలక సంస్థ 6వ డివిజన్ కార్పొరేటర్ కోల మాలతి సంపత్‌రెడ్డి బీసీ-డి (మున్నూరు కాపు) కులధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలు జారీ చేశారు. 6వ డివిజన్ బీసీలకు కేటాయించగా కోల మాలతి సంపత్‌రెడ్డి బీసీ-డి మున్నూరు కాపు కులధ్రువీకరణ పత్రంతో 2020లో జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. అయితే ఆమె రెడ్డి ఓసీ వర్గానికి చెందినవారని, ఆమె సమర్పించిన బీసీ కులధ్రు వీక రణపై విచారణ జరిపి రద్దు చేయాలని కోరుతూ సాధవేని వినయ్‌కుమార్ అనే న్యాయవాది 2020లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టర్ డిస్ట్రిక్ లెవల్ స్క్రూటినీ కమిటీకి మాలతి సంపత్‌రెడ్డి కులధ్రువీకరణ పత్రాన్ని పంపించి విచారణకు ఆదేశించారు. దీనిపై విచారించిన డిఎల్ఎస్‌సి మాలతి సమర్పించిన బీసీ డీ కులధ్రువీకరణ రద్దు చేసింది. దీనితో మాలతిసంపత్ కోర్టును ఆశ్రయించడంతో పాటు ప్రభుత్వానికి కూడా అప్పీలు చేసుకోవడంతో తిరిగి విచారణ జరిపారు. డిఎల్ఎస్‌సి ఇచ్చిన నివేదిక మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ 30రోజుల్లో అప్పీలు చేసుకోవాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# చదరంగ పోటీలు ప్రారంభం

- 11 రాష్ట్రాల నుంచి 300 మంది క్రీడాకారులు రాక
- 100 మంది అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారులు హాజరు



చెస్ ఆడుతున్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19: అఖిలభారత ఫిడె రేటింగ్ అండర్-1,600 చదరంగ పోటీలు జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వనాథ్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ తొలిఎత్తువేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధస్సును పెంపొందించే క్రీడా చదరంగం అని అన్నారు. చిన్నారులు చదరంగా క్రీడను నేర్చుకోవడంతో వారికి జ్ఞాపక శక్తి పెరిగే అవకాశం ఉందన్నారు. తద్వారా విద్యార్థులు చదువులో రాణిస్తారని, మంచి క్రమశిక్షణ అవడుతుందన్నారు. కరీంనగర్‌లో మొట్టమొదటిసారిగా అండర్-1,600 ఫిడె చదరంగ పోటీలను కరీంనగర్ వైశ్యభవన్ వేదికగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. అంతర్జాతీయ క్రీడాకారుడు విశ్వనాథ్ అకాడమీ కోచ్ అంతగిరి విశ్వనాథ్ మాట్లాడుతూ కరీంనగర్‌తోపాటు తెలంగాణ రాష్ట్రంలోని క్రీడాకారులను ప్రొత్సహించే ఉద్దేశ్యంతో జాతీయ, అంతర్జాతీయ చదరంగ క్రీడాపోటీలను ఇక్కడ నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారుల అభివృద్ధే లక్ష్యంగా భవిష్యత్‌లో మరిన్ని పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో దేశంలోని 11 రాష్ట్రాలనుంచి 300 మంది చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో 100 మంది అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారులు ఉన్నారని వివరించారు. మొదటిరోజు నిర్వహించిన 3 రౌండ్ల పోటీల్లో కన్నం విశ్వనాథ్, అరగొండ మోహన్, సి పవన్, బి మహేందర్, గౌరిచందర్ ముందంజలో ఉన్నారని, పోటీల ఆర్బిటర్ సంజయ్ తెలిపారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ అంతగిరి రాజేంద్రప్రసాద్, అకాడమి కోచ్ కొప్పర్తి శివయ్య, కె జగన్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ

# భూములు తీసుకుంటే ఆత్మహత్యే శరణ్యం

● బైపాస్ రహదారి భూ సర్వేను అడ్డుకున్న రైతులు ● సర్వే నిలిపివేసి వెనుదిరిగిన అధికారులు

మెట్‌పల్లి రూరల్, జనవరి 19: వ్యవసాయం చేసుకుంటూ ఉన్న భూములను తీసుకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని రైతులు మండలంలోని మేడిపల్లి గ్రామ శివారులో ఆందోళనకు దిగారు. శుక్రవారం గ్రామ శివారులో అధికారులు సర్వే చేస్తుండగా విషయం తెలుసుకున్న వెల్లుల్ల, బండలింగాపూర్, మేడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు సంఘటన స్థలానికి వచ్చి బైపాస్ రహదారి భూ సర్వేను అడ్డుకున్నారు. విషయం తెలుసు కున్న మెట్‌పల్లి ఆర్డీవో మధు, తహసీల్దార్ శేఖర్ సంఘటన స్థలానికి వచ్చారు. భూములను నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న తాము విలువైన భూములను ఇవ్వమని గతంలోనే చెప్పామని రైతులు పేర్కొన్నారు. రహదారి కోసం భూములు తీసుకుంటే ఉన్న జీవనోపాధి కోల్పోయి పని లేక ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప వేరే దారి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు భూ పరిధిని బట్టి నష్టపరిహారం నిర్ణయిస్తారని, భూ సర్వే చేయనివ్వాలని ఆర్డీవో కోరినా రైతులు వినకుండా సర్వేను అడ్డుకున్నారు. దీంతో చేసేది లేక అధికా రులు సర్వేను నిలిపి వెనుదిరిగారు.



మెడిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మధు

## నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 7,105 మంది విద్యార్థులు

చొప్పదండి జనవరి 19: జాతీయ స్థాయిలో 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే జవహర్ నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 11-30 గంటల నుంచి 1-30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, 7,105 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకరావాలని, అరగంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

● 4 బ్లాకులలో..

నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఏడు జిల్లాల పరిధిలోని 14 బ్లాకులలో 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లాలో 12 పరీక్షా కేంద్రాలు, జగిత్యాలలో 11, సిరిసిల్లలో 5, పెద్దపల్లిలో 5, జయశంకర్ భూపాలపల్లి పరిధిలోని మహాదేవ్‌పూర్‌లో, సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్‌లో, హను మకొండ పరిధిలోని ముల్కనూరులో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యా ర్థులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే 9490395216, 9966759402, 988 5101327 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# 'ఖని'లో సైబర్ నేరస్థుల పంజా

- ఆధార్ అనుసంధానం పేరిట బ్యాంకు ఖాతాలు ఖాళీ
- ఖాతాదారులకు సంబంధం లేకుండా బయట రాష్ట్రాల్లో డబ్బులు విత్‌డ్రా
- గోదావరిఖని వన్‌టౌన్‌లోనే 43కేసులు

కోల్‌సిటీ, జనవరి 19: గోదావరిఖనిలో సైబర్ నేరస్థులు పంజా విసురుతున్నారు. ఆధార్ అనుసంధానం పేరిట బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఖాతాదారులకు సంబంధం లేకుండానే, వారు ఎలాంటి ఫోన్ వాడకుండానే, లింకులు ఓపెన్ చేయకుండానే రోజుకు రూ.10వేల చొప్పున బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము ఖాళీ అవుతుంది. బయటి రాష్ట్రాల్లో ఆధార్ ఎనబుల్ పేమెంట్ సిస్టం(ఏఈపీఎస్) ద్వారా బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు వేసి డబ్బులు విత్‌డ్రా చేసుకున్నట్టు మెసేజ్‌లు వస్తున్నాయి. బ్యాంకుల్లోకి వెళితే పశ్చిమ బెంగాల్, ఒడిశా, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ కేంద్రంగా మినీ ఏటీఎంలలో డబ్బులు డ్రా అయినట్టు గుర్తించారు. బాధితులు అలర్ట్ అయ్యేలోగానే వారి ఖాతాల నుంచి మళ్లింపబడిన సొమ్మును సైబర్ నేరస్థులు డ్రా చేసుకుంటున్నారు. గోదావరిఖని పట్టణంలోనే రెండు నెలల వ్యవధిలో వందల సంఖ్యలో ఈ విధంగా అకౌంట్లను కొల్లగొడుతున్నారు. బాధితులు అలర్ట్ అయి సైబర్ పోర్టల్‌లో 1930 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేసి అకౌంట్లను ఫ్రీజ్ చేస్తున్నారు. ఇలా ఫ్రీజ్ అయినవే 43నమోదు అయ్యాయి. ఇక సొమ్ములు పోగొట్టుకున్నవి వందల సంఖ్యలో ఉంటున్నాయి.

● రంగంలోకి సైబర్ క్రైమ్

గోదావరిఖని పట్టణంలోనే ఈ తరహా నేరాలు జరుగుతుండడంతో రామగుండం కమిషనరేట్ సైబర్ క్రైమ్ అప్రమత్తమయ్యింది. దీనికి సంబంధించి విచారణ ప్రారంభించింది. గోదావరిఖనిలో ఆధార్ ఎనబుల్ పేమెంట్ సిస్టం(ఏఈపీఎస్) సిస్టంతో డబ్బులు పోగొట్టుకున్న బాధితులంతా పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల సందర్భంగా బయోమెట్రిక్ వేలిముద్రలు వేసిన వారే ఉన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల సందర్భంగా కొనుగోలు, అమ్మకాలు చేసిన వారు, సాక్షులుగా ఉన్న వారు బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు వేశారు. వీరి డాటా హ్యాక్ కావడం కానీ, చోరీ జరగడం కానీ అయి ఉంటుందని భావిస్తున్నారు. ఈ దిశగా విచారణ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు మాత్రం తమ సైబర్ సెక్యూరిటీ సిస్టం పటిష్టమైందని, చోరీచేసే అవకాశాలు లేవంటూ పేర్కొంటున్నారు. దీంతో హైదరాబాద్‌లోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సంప్రదించే పనిలో ఉన్నారు.



## గ్రూప్స్ శిక్షణ దరఖాస్తులకు నేడు తుది గడువు

గణేశ్‌నగర్, జనవరి 19: కరీంనగర్ బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణనిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ bcstudycircle.cgg.gov.in లో ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్లో శిక్షణ కోసం డిగ్రీ అర్హత కలిగిన కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగయువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబవార్షిక ఆదాయం ఐదు లక్షల రూపాయలకు మించరాదన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, లేటెస్ట్ కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఆధార్ కార్డ్, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 0878-228686లో, బీసీ స్టడీ సర్కిల్ నూతన భవనము కరీంనగర్ కార్యాలయ సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

## యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు

ధర్మపురి, జనవరి 19: ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో శుక్రవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నేరెళ్ల విజయ్, ప్రదీప్‌కుమార్, సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్య సూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అపమృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గండ దీపంలో నూనె పోసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో కూడా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

## మతిస్థిమితం కోల్పోయి మహిళ ఆత్మహత్య

ముస్తాబాద్, జనవరి 19: మండలంలోని తెర్లుమద్ది గ్రామంలో మతిస్థిమితం కోల్పోయి ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తెర్లుమద్దికి చెందిన తోవెటి లక్ష్మి(55) మతి స్థిమితం కోల్పోయింది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి కుమారుడు కార్తీక్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఊపిరి ఆడక వ్యవసాయ కూలీ మృతి

వీణవంక, జనవరి 19: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన డుకిరె రాజు (32) అనే వ్యవసాయ కూలీ ప్రమాదవశాత్తు బురదలో పడి ఊపిరి ఆడక శుక్రవారం మృతి చెందాడు. పోలీస్‌లు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమ్మత్‌నగర్‌కు చెందిన రాజు ఉదయం వరి నారు మోసేందుకు కూలీ పనికి వెళ్లాడు. నారు నెత్తిన పెట్టుకొని నడుస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బి వంశీకృష్ణ తెలిపారు.

## వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

పెద్దపల్లిటౌన్, జనవరి 19: పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డులో నిర్వహిస్తున్న వ్యభిచారం గృహంపై శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. పట్టణానికి చెందిన ఓ మహిళ చీకురాయి రోడ్డులో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని వ్యభిచార స్థావరం నిర్వహిస్తుందన్న పక్కా సమాచారంతో దాడి చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు మహిళలను సఖి కేంద్రానికి తరలించినట్లు, స్థావరం నిర్వహిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 19: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,700 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 61మంది రైతులు 538క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,700, కనిష్ఠ ధర 5,800 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 1,080క్వింటాళ్ల పత్తిని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసింది.

# జిల్లా క్రికెటర్లు భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాలి

- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి




మాట్లాడుతున్న గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19: జిల్లాలో క్రికెట్‌లో రాణించిన క్రీడాకారులు ఎందరో ఉన్నారని, భవిష్యత్‌లో జిల్లాకు చెందిన క్రికెటర్లు రంజీ, భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఆకాంక్షించారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం, ఎస్సారార్ కళాశాల మైదానంలో జరుగుతున్న యూనిటీ కప్ 2024, క్రికెట్ లీగ్ పోటీలు శుక్రవారం నాటికి క్వార్టర్స్ ఫైనల్ దశకు చేరుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం స్టేడియంలో జరిగిన మొదటి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని హెచ్‌సీఏ, బీసీసీఐలను కోరనున్నట్లు తెలిపారు. క్రికెట్‌లో ఉన్న ఆసక్తిని బట్టి జిల్లాలో క్రికెట్ అకాడమీలను నెలకొల్పడానికి హెచ్‌సీఏ ముందుకు రావాలని సూచించారు. ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించిన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రికెటర్లను వెలుగులోకి తీసుకొస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కరీంనగర్ క్రికెట్ క్లబ్ అధ్యక్షులు యాదగిరి మాట్లాడుతూ మ్యాచ్‌లు అత్యంత హోరాహోరీగా జరుగుతున్నాయని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు భారీ ప్రైజ్‌మనీని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి పుల్లమల్ల ప్రసాద్, సుల్తానాబాద్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి సిలివేరి మహేందర్, క్రికెట్ కోచ్ కన్నన్, నిర్వాహకులు సురేష్, మహర్షి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రత్యేక ఓటరు నమోదు

**- మంథని ఆర్డీవో హనుమా నాయక్**

మంథని, జనవరి 19: మంథని నియోజకవర్గంలోని 288 పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని ఆర్డీవో హనుమానాయక్ శుక్రవారం తెలిపారు. 2024 జనవరి 1 వరకు 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జనవరి 6న విడుదల చేసిన ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే ఈ రెండు రోజుల్లో జరిగే ఓటరు ప్రత్యేక కార్యక్రమాల్లో తమకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 288 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**ఎలిగేడు, జనవరి 19 :** మండలంలోని 12గ్రామాల్లో నూతన ఓటరు నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ స్వర్ణ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 1వ తేదీ నాటికి 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈనెల 20, 21 తేదీల్లో ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ నమోదు కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని ఈ అవకాశాన్ని నూతన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**పాలకుర్తి, జనవరి 19 :** ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జ్యోతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20,21 తేదిల్లో మండలంలో ప్రతి బూత్ లెవల్ అధికారి తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లోనే ఉదయం 9గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటారని, నూతన ఓటరు నమోదులో పాల్గొని ఇప్పటివరకు ఓటు హక్కు రానివారు నమోదు చేసుకోవడంతో పాటు, గతంలో ఓటు హక్కు కలిగి ఉన్నవారు కూడా ఏమైన సవరణలుంటే సరిచేసుకోవచ్చని ఆమె తెలిపారు.

### రామగిరి ఆర్ఐ-2గా బాధ్యతల స్వీకరణ


నిహారిక

రామగిరి, జనవరి 19: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-2గా రెవెల్లి నిహారిక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన నిహారిక ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆర్ఐకి సిబ్బంది స్వాగతం పలికారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ సహకరంతో కృషి చేస్తానని నిరాహారిక పేర్కొన్నారు.

### గుండారం సమ్మక్క-సారక్క జాతర చైర్మన్‌గా శంకర్

కమాన్‌పూర్, జనవరి 19 : మండలంలోని గుండారం గ్రామంలో సమ్మక్క-సారక్క జాతర కమిటీ చైర్మన్ ఎన్నిక శుక్రవారం జరిగింది. పిడుగు శంకర్‌ను జాతర చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నుంచి సమ్మక్క-సారమ్మ గద్దెల వద్ద పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 21నుంచి 24వ తేదీ వరకు జాతర జరుగుతుందని తెలిపారు.

### 21న ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం సమావేశం

కోల్‌సిటీటౌన్, జనవరి 19: ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ డెలిగేట్స్ సమావేశం ఆదివారం పెద్దపల్లిలోని నందన గార్డెన్స్‌లో ఉదయం 10గంటలకు ఏర్పాటు చేసినట్టు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కాంపెల్లి సతీష్, కార్యదర్శి లింగయ్య, సదయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సంఘాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంతోపాటు భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కవ్వంపల్లి సత్యనారాయణలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

### డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సినిమా పోస్టర్ల దహనం

కోల్‌సిటీటౌన్, జనవరి 19:గుంటూరు కారం సినిమాలో విలన్ల పేర్లు మార్క్స్, లెనిన్ అని పెట్టడాన్ని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని ప్రధానచౌరస్తాలో సినిమా పోస్టర్లను దహనం చేశారు. సినిమాను నిలిపివేయాలని, దర్శక, నిర్మాతలు క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొంటు సాగర్, నాయకులు రాజకుమార్, సురేష్, హమీద, కల్పన, ప్రవీణ్, సాగర్, కృష్ణ, శివ, సతీష్, మహేష్, రజిత, సంధ్య పాల్గొన్నారు.

### రాఘవపూర్ సర్పంచ్‌పై అనర్హత వేటు

పెద్దపల్లి రూరల్, జనవరి 19 : మండలంలోని రాఘవపూర్ గ్రామ సర్పంచ్ అడెపు వెంకటేషంను అనర్హత వేటు వేసినట్లు డీపీవో ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన తాడిశెట్టి శ్రీకాంత్ పంచాయతీరాజ్ చట్టం-2018కి విరుద్ధంగా ముగ్గురు పిల్లలు కలిగి ఉన్నారని ఫిర్యాదు చేయగా, మండల అధికారులు విచారణ చేపట్టి జిల్లాపంచాయతీ అధికారికి వివరాలు అందించారు. పరిశీలించిన జిల్లా కలెక్టర్ గ్రామ పంచాయతీల్లో జరిగే సమావేశాలకు సర్పంచ్ అనుమతించవద్దని, సర్పంచ్ సైతం హాజరుకానివద్దని, సర్పంచ్ పదవికి అనర్హుడని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

### పారిశుధ్య పనుల పరిశీలన

రామగిరి జనవరి 19: మండలంలోని బేగంపేట్, కల్వచర్ల గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం డీఎల్‌పీవో రాంబాబు తనిఖీ నిర్వహించారు. గ్రామాల్లో ఉదయం పారిశుధ్య పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వెంట ఎంపీవో కాటం భాస్కర్, సెక్రెటరీ శ్రీనివాస్, కారోబార్ కనకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.




### అధికారుల సంఘం ఉపాధ్యక్ష పదవికి నామినేషన్


నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న శ్రీహరి

రామగిరి, జనవరి 19: సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ ఏరియా అధికారుల సంఘం (సీఎంవోఏఐ) ఉపాధ్యక్ష పదవికి పర్సనల్ డిప్యూటీమేనేజర్ గుర్రం శ్రీహరి శుక్రవారం నామినేషన్ వేశారు. ఈమేరకు తన నామినేషన్‌ను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, అధికారులు శ్రీనివాసులు, వెంకటరమణ, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, ఐలయ్య, సునీల్‌ప్రసాద్, రాజేశంలు పాల్గొన్నారు.

### కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా తిరుపతి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 19: ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా బుర్ర తిరుపతి ఎన్నికయ్యారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షుడిగా బుర్ర తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే. అక్బర్‌అలీలు ఎన్నికయ్యారు. ఇంచార్జిగా ముష్క సమ్మయ్య, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శిగా అఫ్రోజ్‌ఖాన్‌లను కౌన్సిల్ ఎన్నుకున్నది.

### కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 19: కాంగ్రెస్ పార్టీ సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బీ అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం జోన్-3లో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు న్యాయమైన వేతనాలు, చట్టబద్ధ హక్కులు అమలుచేయడం లేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆందోళనలు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, వేతనాలు పెంచడంతో పాటు ఇతర సదుపాయాలు, వసతుల కల్పనకు ఎన్నికల బరిలో నిలిచి కాంగ్రెస్ అభ్యర్థులు కాంట్రాక్టు కార్మికులకు హామీ ఇచ్చినట్టు అశోక్ పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్లను అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని అశోక్ డిమాండ్ చేశారు. ఈసమావేశంలో జీ రాము, ఎస్ వెంక టేష్, దేశాయి నాయక్, రాంబాబు, డీ పద్మ, రాజనర్సు, రాజేశ్వరి పాల్గొన్నారు.

# 'ఆదర్శ' విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లి కల్చరల్, జనవరి 19 : జిల్లాలో ఎంపిక చేసిన ఐదు ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్రాభివృద్ధి దిశగా కట్టుదిట్టమైన కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తొలి మెట్టు, ఉన్నతి, 10వ తరగతి పరీక్షలు వంటి అంశాలపై సంబంధిత ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీక్షించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసి, వాటిలో విద్యార్థులు సమగ్రాభివృద్ధి చెందే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదర్శ పాఠశాలల్లో రన్నింగ్ వాటర్ సౌకర్యం, కిచెన్ గార్డెన్, కిటికీలకు మెష్, ఫ్యాన్, లైట్లు మొదలగు కనీస సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని పాఠశాలల్లో బాలికలకు తప్పనిసరిగా టాయిలెట్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాఠశాలలకు రెగ్యులర్‌గా గైర్హాజరయ్యే విద్యార్థుల ఇంటికి ఉపాధ్యాయులు వెళ్లి కారణాలు తెలుసుకోవాలని, పాఠశాలలకు పిల్లలను పంపేలా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేయాలని అన్నారు. వంద శాతం హాజరు ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి బహుమతులు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. స్థానికంగా ఉన్న ప్రముఖ వ్యక్తులతో పిల్లలను ప్రోత్సహించేలా తరగతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు చెడు మార్గాల వైపు మరలకుండా జాగ్రత్త వహించాలని, వారి కుటుంబంలో, సమాజంలో ఉండే దుష్ప్రభావం విద్యార్థులపై పడకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. గ్రామంలోని పాఠశాలల్లో క్రీడాపోటీలు నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే గ్రౌండ్, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఇతర సౌకర్యాలు అందరికీ తెలిసేలా చేయాలన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం జిల్లాలో ఉన్న ఎన్టీపీసీ, నీటిపారుదల ప్రాజెక్టులు, మొదలగు విజ్ఞాన పర్యటనలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తే దానికి అవసరమైన సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో కనీస విద్యాప్రమాణాలు అందించే దిశగా చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమం మంచి ఫలితాలు అందిస్తోందని, జిల్లాలోని ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రమాణాలు మెరుగుపరిచేందుకు మరింత విస్తృతంగా కృషి చేయాలని సూచించారు. వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి పాఠ్యాంశాలు, తెలుగు, ఆంగ్లంలో చదవడం, రాయడం, బేసిక్స్, గణితం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి బెస్ట్ టీఎల్ఎం ద్వారా బోధించాలని అన్నారు. తరగతి గదిలో వెనకబడిన ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయులు ప్రత్యేకంగా గమనించాలని, సదరు విద్యార్థి ఏ విభాగంలో వెనుకబడి ఉన్నారు, దానిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిసారించాలని, విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని, ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు హాజరై విద్యార్థులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో చదవడం, రాయడంలో ఇబ్బందులు ఉన్న విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన శిక్షణ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు వెనుక బడి ఉన్న పాఠ్యాంశాలపై లెర్నింగ్ వీడియోలను ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులకు జనవరి చివరి నాటికి కౌన్సెలింగ్ తరగతులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ముఖ్యమైన పాఠ్యాంశాలను రెండు, మూడు సార్లు బోధించాలని, సదరు పాఠ్యాంశాలను విద్యార్థులు అధికంగా ప్రాక్టీస్ చేసేవిధంగా చూడాలని, విద్యార్థులకు రాయడం అధికంగా అలవాటు చేయాలని అన్నారు. పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, 10వ తరగతి విద్యార్థులు ప్రతిరోజు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలని, విద్యార్థుల ఇంటికి ఉదయం, సాయంత్రం ఫోన్ చేసి వారు ఇంటి వద్ద పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విధంగా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై కళాకారుల ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 19: మండలంలోని మీర్జంపేటలో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్‌వో ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ పథకాలపై సాంస్కృతిక సారథి కళాకారులు పాటలతో ప్రచారం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు యువత అలవాటు పడకుండా, చెడు మార్గంలో నడవకుండా ఉండాలని, రేపటి దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందని, అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల్లో అమలైన రెండు గ్యారెంటీలు మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీపైన పాటల రూపంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రాజనర్సు, ఈదునూరి పద్మ, కొండ్ర వెంకన్న, ఇల్లందుల మల్లేష్, జిన్నా రమ, దీకొండ శ్రావణ్, సలేంద్ర రాజన్న, కన్నూరి రేణుక, సాయిల శ్రీను, కటుకు శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న కళాకారులు


ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో అక్షింతలు పంపిణీ చేస్తున్న నాయకులు

### ఇంటింటికి అయోధ్య అక్షింతలు పంపిణీ

కోల్‌సిటీ, జనవరి 19: అయోధ్యలోని రామాలయంలో పూజలు చేసిన అక్షింతలను శుక్రవారం ఆర్ఎఫ్‌సీఎల్‌లోని శివాలయం దేవాయలం నుంచి ర్యాలీగా ఆర్ఎఫ్‌సీఎల్‌లోని టౌన్‌షిప్‌లో అక్షింతలను సోమారపు లావణ్య, అరుణ్‌కుమార్ పంపిణీ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ జీఎం ఎస్‌కే ఝాకు అక్షింతలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్యలోని రామాలయ నిర్మాణం కోసం యావత్ దేశమంతా సహకరించిందని, ఈనెల 22న రామాలయం ప్రారంభించనున్న సందర్భంగా అక్షింతలను ఇంటింటికి వితరణ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సింహారావు, అజయ్, వెంకటి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

**- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు**

పెద్దపల్లిటౌన్, జనవరి 19 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముత్యంరావుతో పాటు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్, రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాసపల్లి తిరుపతి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, అందుకు కార్మిక వర్గం, రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్య పోరాటం నిర్వహించాలన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్మడం, కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను, సౌకర్యాలను నిర్వీర్యం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడం, నిరుద్యోగాన్ని పెంచడం, నిత్యావసర సరుకుల, వస్తువుల ధరలను అడ్డూఅదుపు లేకుండా పెంచడం, పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలకు విద్యా, వైద్యం అందుబాటులో లేకుండా చేస్తున్నారన్నారు. ఈనెల 19 నుంచి ఫిబ్రవరి 16 వరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో పెద్దపల్లి జిల్లాలోని కార్మిక వర్గం, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మంద రాజేందర్, నాయకులు శ్రావణపెల్లి వెంకటస్వామి, సతీష్, రవి, సురేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

### జీవో నంబరు 317ను రద్దు చేయాలి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 19: జీవో నంబరు 317ను రద్దు చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావులకు పెగడపల్లిలో శుక్రవారం ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. జీవో వలన స్థానికతను కోల్పోయి ఇంటికి పిల్లలకు తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నామని, జీవో రద్దు విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని ఎమ్మెల్యే విజయరమణరావు, ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావులను కోరారు. జీవో వలన కొంత మంది ఉద్యోగులు ఇబ్బందులకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. సత్యనారాయణరావు, గుండు కృష్ణమూర్తి, కోటేశ్వర్‌రావు, వహిదాబీ, కొత్త లీల, కోటి రెడ్డి, చంద్రమోహన్, లాలునాయక్, సాగర్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు


అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

### అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పెద్దపల్లిటౌన్, జనవరి 19: అగ్ని ప్రమాదాల నివారణపై శుక్రవారం స్థానిక ఎఫ్‌సీఐ గోదాంలో అగ్ని మాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గోదాం కార్మికులు, సిబ్బందికి వివరించారు. గ్యాస్ సిలిండర్, ఎలక్ట్రికల్, రోడ్డు, రైలు అగ్ని ప్రమాదాలపై సిబ్బంది పరికరాలతో ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే భూకంపాలు, వరదలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో గోదాం మేనేజర్, చంద్రమోహన్, అగ్నిమాపక సిబ్బంది మనోహర్, సంతోష్, శ్రావణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్, జనవరి 19: తమ వేతనాలు పెంచాలని కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఒక్కొక్కరు వ్యక్తిగతంగా వినతిపత్రం అందించారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 73షెడ్యూల్ పరిశ్రమలకు సంబంధించిన కనీస వేతన జీవోలను 2021జూన్‌లో విడుదల చేసిన గత ప్రభుత్వం గెజిట్‌చేసి అమలు చేయలేదని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(ఎస్‌సీకెఎస్-సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దూలం శ్రీనివాస్, బి మధుపేర్కొన్నారు. దీనివల్ల కాంట్రాక్టు కార్మికులు పెద్దఎత్తున నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి జీవోలను గెజిట్‌చేసి వేతనాలు పెంచాలని కోరారు. అనంతరం సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్ బలరాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మి కులు పాల్గొన్నారు.

**మందమర్రి టౌన్:** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం సీఎండీ బలరాంను హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో కలిశారు. సమస్యలను ఆయనకు విన్నవించారు. ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్నా కనీ సవేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికసంఘం నాయకులు శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.


సీఎండీ బలరాంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

### పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

పెద్దపల్లిటౌన్, జనవరి 19: ఈ నెల 20, 21 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి సీహెచ్ మధుమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం 2024 భాగంగా రెండు రోజులు పాటు పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలోని 290 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రెండురోజుల పాటు బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఓటర్ నమోదు కోసం సవరణలపై దరఖాస్తులు తీసుకుంటామన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండి ఓటుహక్కులేని వారు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు.

**ఓదెల:** మండలంలో ఈ నెల 20, 21 తేదీల్లో పోలింగ్ బూత్ లలో ప్రత్యేక ఓటరు క్యాంపెయిన్‌ను నిర్వహించాలని ఓదెల తహసీల్దార్ యాకయ్యకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలు జారీ చేశారు. బూత్ లెవెల్ అధికారులు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్‌స్టేషన్లలో ప్రత్యేక విధులు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే మండలంలోని ప్రతీ గ్రామంలో బీఎల్‌వోలు తప్పనిసరిగా పోలింగ్ బూత్‌ల్లో విధులు నిర్వహిరచాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

### పార్లమెంట్ స్థానం సీపీఐకి కేటాయించాలి

ఓదెల, జనవరి 19: పెద్దపల్లి పార్లమెంట్ స్థానం సీపీఐ తరపున జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందంకు కేటాయించాలని మండల కార్యదర్శి కోడం స్వామి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో స్వామి మాట్లాడుతూ 1984లో పెద్దపల్లి అసెంబ్లీ స్థానం సీపీఐకి కేటాయించిందని తర్వాత మళ్లీ కమ్యూనిస్టు పార్టీకి కేటాయించలేదని తెలిపారు. టీడీపీ పాలనలో సీపీఐకి పెద్దపల్లి నియోజకవర్గంలో అధిక ప్రాబల్యం ఉన్నప్పటికీ కూడా సీపీఐకి కనీసం అసెంబ్లీ, కానీ పార్లమెంట్ స్థానం కానీ కేటాయించలేదన్నారు. ప్రస్తుతం ఇప్పటికైనా పార్లమెంట్ స్థానం సీపీఐకి కేటాయించాలని జాతీయ, రాష్ట్ర నాయకత్వాన్ని కోరడం జరిగిందని, తాండ్ర సదానందంకు ఎంపీ సీట్లు కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గ్రామ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

### ఓదెల మాజీ ఉపసర్పంచ్ మృతి

ఓదెల, జనవరి 19: మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ క్యాతం రాజేశం(87)అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడైన రాజేష్ 1970లో మొదటిసారిగా ఓదెల ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అనంతరం రెండు పర్యాయాలుగా గ్రామ ఉపసర్పంచ్‌గా కొనసాగారు. శుక్రవారం ఓదెలలో పద్మశాలి సంఘం, కాంగ్రెస్ నాయకుల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. రాజేశం నేత్రాలను అతని కుటుంబసభ్యులు దానం చేశారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సిబ్బంది, సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మేర్గు భీష్మచారి ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు.

### గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 19: గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సత్యప్రసాద్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గురుకులాలను ప్రతి ఒక్క విద్యార్థి వినియోగించుకోవాలని ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదో తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనవరి 20 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందని తెలిపారు. వంద రూపాయల ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

### ప్రభుత్వ భూములను పరిశీలించిన తహసీల్దార్


కటికెనపల్లిలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రజిత

ధర్మారం, జనవరి 19: ధర్మారం మండలం కటికెనపల్లి శివారులోని 1255, 253సర్వే నంబరులోగల ప్రభుత్వ భూములను శుక్రవారం తహసీల్దార్ ఏ రజిత పరిశీలించారు. కటికెనపల్లిలో సబ్‌స్టేషన్, మహిళా సంఘం, పల్లె దవాఖాన భవన నిర్మాణాలకు ప్రభుత్వ భూములను కేటాయించాలని అక్కడి ప్రజలు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు విన్నవించారు. ఈ మేరకు తహసీల్దార్ ఏ రజిత వాటి నిర్మాణాలకు అనువైన స్థలాన్ని కేటాయించడానికి ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఎంఆర్ఐ రమ్య, సర్వేయర్ నరేష్, కాంగ్రెస్ నాయకులు రేండ్ల నరేష్, రామడుగు గంగారెడ్డి, బోనగిరి శ్రీనివాస్, అజయ్,కట్టశ్రీహరి, తుమ్మ సాయి తదితరులు ఉన్నారు.

### ఉచిత వైద్య శిబిరం

ధర్మారం, జనవరి 19: మండలంలోని కమ్మరీఖాన్‌పేట గ్రామంలో శుక్రవారం కరీంనగర్‌లోని సన్‌షైన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ గుజ్జుల రమావేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 600మందికి ఆసుపత్రి వైద్యులు ఉచిత పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఉపసర్పంచ్ కుందేళ్ల కిరణ్‌కుమార్, హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఓల్లోజి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

### కొనసాగుతున్న భాగవత సప్తాహం

మంథని, జనవరి 19: స్థానిక దహగం లింగన్న స్వగృహంలో వేద పండితులు మంగళంపల్లి వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో కొల్లారపు వెంకటరాజం భాగవత సప్తాహం వైభవంగా కొనసాగుతోంది. ఈనెల 23వ వరకు భక్తుల కోసం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో దహగం రామకృష్ణయ్య కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### తబితా ఆశ్రమానికి బియ్యం వితరణ

రామగుండం, జనవరి 19: స్థానిక తబితా అనాథ పిల్లల ఆశ్రమానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, కూరగాయలు, అరటిపండ్లు, చాకెట్లు, పెన్నులు శక్రవారం అందజేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ మంచిర్యాల రూట్ లక్ష్మీనగర్ ప్రతినిధి పెద్దపెల్లి స్వప్న జన్మదినం సందర్భంగా స్థానిక ఆశ్రమానికి సరుకులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ మంచిర్యాల రూట్ లక్ష్మీనగర్ అధ్యక్షులు చైతన్యచంద్రరాజు, కార్యదర్శి సంగెల మధుకర్, జాయింట్ సెక్రటరీ పెద్దపల్లి రవీందర్, సురేష్, కె రజని, వి సాహితీ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

కళ్యాణ్‌నగర్, కోల్‌సిటీటౌన్, జనవరి 19: గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని కేడీసీసీ బ్యాంకులో ఖాతాదారుడైన భోగ రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి పీఎంజేజేబీవై ఇన్సూరెన్స్ కింద రెండు లక్షల రూపాయల విలువైన చెక్కును భోగ రాజు నాగమణికి మేనేజర్ సుద్దాల శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ సుద్దాల శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకులో ఖాతా ఓపెన్ చేసే సమయంలో ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన పథకాలతో ఆర్థిక భద్రత చేకూరు తుందన్నారు. ఏఎం కీర్తన, ఎస్ఏ శ్రీనివాస్, శివ, రమాదేవి, రవళి పాల్గొన్నారు.

### చేతిపంపుల మరమ్మతు

రామగిరి, జనవరి 19: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ జోన్-1లోని చేతి పంపులు మరమ్మతుకు నోచుకోకపోవడంతో పన్నూరు సర్పంచ్ అల్లం పద్మ స్పందించారు. శుక్రవారం పంచాయతీ తరుపున మూడు చేతి పంపులకు మరమ్మతులు చేయించారు. మరమ్మతు కోసం సర్పంచ్ ప్రత్యేక చొరవ చూపడంపై కార్మికులు హర్షం ప్రకటించారు.

### ఘనంగా రఘువర్ధన్‌రావు వర్ధంతి

జూలపల్లి, జనవరి 19. మండలంలోని వడుకాపూర్‌కు చెందిన ధర్మారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరి రఘువర్ధన్‌రావు వర్ధంతిని శుక్రవారం ఆయన కుటుంబసభ్యులు, నాయకులు, గ్రామస్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువర్ధన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మొగురం రమేష్, మాజీ సర్పంచ్ కొత్త రవీందర్, బీజేపీ జిల్లా నాయకులు కంకనాల జ్యోతిబసు, మాజి ఎంపీటీసీ ఎర్రోల్ల రాములు, కన్నం రాంనారాయణ, ఎండీ అతిక్‌పాషా, గుమ్మడి లక్ష్మణ్ కోరెపు సంపత్, మొగురం నరేష్, కన్నం రాజేశం, వేల్పుల గట్టయ్య, తువ్వ కనుకయ్య, కనకట్ల లచ్చయ్య, మొగురం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.